

కథ 2009

11

# అతను

## సాయి బ్రహ్మానందం గొర్తి

శాన్‌ఫ్రాన్సిస్కో నుండి విమానం బయల్దేరడానికి సిద్ధంగా ఉంది. ఉత్పల తన సీటు నంబరు చూసుకొని కూర్చుంటూ హేండ్‌బ్యాగ్ పక్కనున్న ఖాళీ సీటులో పెట్టింది. విండో సీటు అడిగింది కాని, దొరకలేదు. మూడేళ్ల కూతురు నేహ గుర్తొచ్చి ఒక్కసారి కళ్లు మూసుకుంది. ఇహ ఫ్లయిట్ బయల్దేరడానికి సిద్ధమవుతుండగా ఒకతను వచ్చాడు.

''ఎక్స్క్యూజ్ మీ...'' ఒక్కసారి ఉలిక్కిపడి చూసింది. ఎదురుగా ముప్ఫై ఏళ్ల యువకుడు నవ్వుతూ కన్పించాడు. అతని రూపురేఖల్ని బట్టి ఇండియన్ అనిపించాడు. నవ్వుతూ తన విండో సీటు కేసి చూపించాడు. ఉత్పల సీట్లోంచి లేస్తుండగా అతనే అడిగాడు.

''ఇఫ్ యూ డోంట్ మైండ్... కెన్ యూ ప్లీజ్ టేక్ ద విండో సీట్.''

తలెత్తి అతనికేసి చూసింది. అలా చూసేసరికి అతనే మళ్లీ అన్నాడు.

''ఇట్ మే బి ఇన్‌కన్వీనియన్స్ ఫర్ యూ... ఇఫ్ ఐ...''

అర్థమయ్యింది ఉత్పలకి. తనూ విండో సీటే కావాలనుకుంది. సరేనన్నట్లు విండో సీట్లో కూర్చుంది. అతను థాంక్యూ అంటూ బ్యాగ్‌ని పైన సర్ది కూర్చున్నాడు. విమానం బయల్దేరింది. కొంతసేపయ్యాక టేకాఫ్‌లో ఆర్పేసిన లైట్లు తిరిగి వేశారు. ఉత్పల తను తెచ్చుకున్న తెలుగు నవల చదువుదామని హేండ్‌బ్యాగ్ లోంచి తీసింది. అతను ఆ పుస్తకం కేసి చూశాడు.

''మీరూ తెలుగేనా...''

అవునన్నట్లు తలూపింది.

''నేనూ తెలుగే. మాది విజయవాడ. మీది...''

''రాజమండ్రి...'' తలెత్తకుండానే ముక్తసరిగా జవాబిచ్చి నవల చదవడం ప్రారంభించింది.

ఓ రెండు నిమిషాల తరువాత అతనే మళ్లీ అడిగాడు.

''మీరూ హైద్రాబాద్‌కేనా...''

''ఊఁ...''

''నేనూ అక్కడికే... సింగపూర్‌లో మీది ఈవినింగ్ ఫ్లయిటేనా?''

జవాబివ్వకపోతే వదిలేట్టుగా లేడు. అవునని చెప్పింది. ఇహ అతనే ప్రశ్నల వర్షం కురిపించాడు.

''మీరెక్కడుంటారు?''

ఏరియా చెప్పింది ఉత్పల.

''మేమూ సన్నీవేల్ దగ్గరే. కుపర్టినోలో ఉంటాం. నేను యాపిల్‌లో పనిచేస్తాను. మీరు?''

''ఏం చెయ్యను... ఖాళీ,'' అంది.

''మీకు...'' అంటూ ఆమె మెడలో మంగళ సూత్రాలు చూసి ఆగిపోయాడు. పేంటూ, టీ షర్టూ వేసుకున్నా ఉత్పల మెళ్లో సూత్రాలు బయటికి కనిపిస్తూనే వున్నాయి. అది చూసి అతను మాట మార్చాడు.

''మీవారెక్కడ పనిచేస్తారు?''

''సిస్కోలో...''

''ఓ... మీవారు కూడా సాఫ్ట్‌వేరే అన్నమాట. నేనూ అంతేలెండి. ఈ సిలికాన్‌వేలీ నిండా తెలుగువాళ్లే...''

ఇంతలో ఓ చిన్నపిల్ల ఏడుపు వినిపించింది. చూడ్డానికి ఇండియన్‌లా ఉన్న ఒకావిడ ఏడుస్తున్న పిల్లను తీసుకుని వారి సీట్ల ముందు నుండి వెళ్లింది. ఆ పిల్ల ఏడుపుకి తల్లే కారణమన్నట్టు ఎంతో ఇబ్బంది గా ఫీలవుతూ ఆమెకేసి చూస్తున్నారంతా. వేరే కేబిన్ వైపుగా వెళ్లినా ఆ పిల్ల ఏడుపు స్వరం వినిపిస్తూనే వుంది.

కాసేపటికి ఎయిర్‌హోస్టెస్ వచ్చి, "ఆర్ యు డాక్టర్ ఉత్పల... కుడ్ యూ ప్లీజ్ హెల్ప్ అజ్..." అని అడిగింది.

ఉత్పల ఆమెననుసరించింది. ఓ ఇరవై నిమి షాల తర్వాత ఉత్పల సీటు దగ్గరకి రాగానే, "ఆ పిల్లకే మైంది?" ఆశ్చర్యంగా అడిగాడు అతను.

"బానే ఉంది. హై అల్టిట్యూడ్ ప్రెషర్ వల్ల చెవి నొప్పొచ్చుంటుంది. చెవిలో దూది పెట్టాము. వాళ్ల దగ్గరున్న మందులిచ్చారు. ప్రస్తుతానికి బానే ఉంది."

"మీరు డాక్టరా? ఇందాక ఉద్యోగం అంటే ఖాళీ అని చెప్పారు," తనేదో కావాలని అబద్ధం చెప్పినట్టుగా అతను కాస్త నిష్టూరంగా అన్నాడు.

"మీరు ఏం జాబ్ చేస్తారని అడిగారు. ఏం చెయ్య డం లేదని చెప్పాను. నేను డాక్టర్నే. కానీ అమెరికాలో కాదు. నిజంగానే ఉద్యోగం చేయడం లేదు."

అతను ఉత్పల మాటలకి మరింత ఆశ్చర్య పోయాడు.

"డాక్టర్ చదివి ఖాళీగా ఉన్నారా? అమెరికా వచ్చిన ప్రతి అమ్మాయి మొదట చేసే పని ఉద్యోగమే. అలాంటిది మీరు..."

ఉత్పల సమాధానం ఇవ్వలేదు. నిజానికి ఏం చెప్పాలో తెలీలేదు. మౌనంగా ఉండిపోయింది.

ఓ క్షణమాగి అతనే మళ్లీ అన్నాడు. "ఇండియా లో మెడిసిన్ ఎక్కడ చదివారు... ఏ బాచీ...?"

"గుంటూరు మెడికల్ కాలేజీ... 2000లో కంప్లీట్ చేశాను."

"పెళ్లయి అమెరికా రాగానే ఉద్యోగం వెతికితే గానీ కుదర్దండి. మా ఆవిడ విషయంలో మొట్టమొదట నేను చేసిన పనదే," ఎంతో గర్వంగా చెప్పాడు.

ఉత్పల నవ్వింది. అంతకుమించి తిరిగి సంభా షణ పొడిగించలేదు. ఇంతలో రిఫ్రెష్‌మెంట్స్ వచ్చాయి. ఉత్పల కాఫీ తాగుతుండగా, "బై ద వే... నా పేరు వర్మ. మా ఆవిడ కూడా జాబ్ చేస్తోంది. పిల్లలతో చేసుకోలేక మా అత్తగార్ని తీసుకురావడానికి హైదరాబాద్ వెళు తున్నాను. ఆవిడ ఒక్కావిడా ప్రయాణం చెయ్యలేదు. మాకు ఇద్దరు పిల్లలు. మీకూ పిల్లలున్నారా?"

పిల్లలనగానే నేహ గుర్తుకొచ్చింది. అమ్మ కోసం ఏడవడం లేదుకదా? చెల్లెలి ఇంటికి స్లీపోవరుకని పంపించి ఇలా చెప్పకుండా వచ్చేసింది. తనకొక కూతు రుందన్న విషయం చెప్పింది.

"ఇండియాలో మీవాళ్లని చూడ్డానికి వెళుతు న్నారా?" జవాబు చెప్పేవరకూ వదిలిపెట్టేట్టుగా లేడు అతను.

జవాబు చెప్పడం ఇష్టం లేనట్టుగా పుస్తకం చదువుతున్నట్టుగా నటించింది. అది గ్రహించి అతనూ రెట్టించలేదు. ఆ తరువాత ఇహ మాటలు ముందుకెళ్ల లేదు.

నిద్రపోయే సమయమయ్యిందని విమానంలో లైట్లు ఆర్పేశారు. పుస్తకం చదువుతూ నిద్రలోకి జారు కుంది ఉత్పల. అతను మాత్రం సినిమా చూడ్డంలో నిమగ్నమయ్యాడు.

*

ఉత్పలకి మెలకువొచ్చి చూస్తే ఫ్లయిట్‌లో అందరూ దిగడానికి సిద్ధమవుతున్నారు.

"హాంగ్‌కాంగ్ వచ్చామండి. ఇక్కడో రెండు గంటలు హాల్ట్ ఉంటుందేమో," వర్మ చెప్పాడు.

ఉత్పల కళ్లు నులుపుకుంటూ లేచింది. వెయి టింగ్ ప్లేస్ అని ఒకచోట ప్రయాణీకులందర్నీ ఉండ మని చెప్పారు. అక్కడో కుర్చీ చూసుకుంది ఉత్పల. మధ్యలో రెండు కుర్చీలు వదిలేసి వర్మ కూర్చుని బాగ్ లోంచి లాప్‌టాప్ తీసి ఆన్ చేశాడు. ఉత్పల మొహం కడుక్కొని వచ్చి మళ్లీ కూర్చుంది.

"ఇక్కడ వైర్లెస్ కనెక్షన్ వచ్చి చావడం లేదు. పక్కనే ఎక్కడైనా ఇంటర్నెట్ ఉందేమో చూస్తాను. మా ఆవిడకి హాంగ్‌కాంగ్ వచ్చామని ఈమెయిల్ కొట్టాలి."

అతనికి కుటుంబం అంటే ఎంత ప్రేమో అను కుంది ఉత్పల. ఈసారి నేహతో పాటు ప్రభాకర్ గుర్తు కొచ్చాడు. తన భర్త తనని ప్రేమించాడు. చెప్పాపెట్ట కుండా ఇలా ఇండియా ప్రయాణమయ్యిందని తెలిసి కంగారుపడుతున్నాడేమో? ప్రభాకర్ మాటెలా ఉన్నా నేహని తలుచుకుంటే ఏడుపొచ్చింది. అనవసరంగా ఆ చిన్నపిల్ల మనసుని కష్టపెట్టానేమో? ఎడతెరిపిలేని ఆలోచన్లు. అప్రయత్నంగా కన్నీళ్లొచ్చాయి. ఇంతలో వర్మొచ్చాడు. అతన్ని చూసి కళ్లు తుడుచుకుంది.

"పేరుకి పెద్ద ఎయిర్‌పోర్టే కానీ ఒక్కచోటా ఈమెయిల్ లేదు. ఒక్కచోట ఉన్నా చాంతాండంత లైనుంది."

"ఓ... అలాగా," అనేసి ఊరుకుంది.

"మా ఆవిడకి ఈమెయిల్ ఇస్తానని చెప్పాను. ఎదురుచూస్తూ ఉంటుంది. నేను కూడా లేను కదా! ఇద్దరు పిల్లల్నీ చూసుకోవడం కష్టమే. మా అమ్మాయి కింకా రెండేళ్లే. పెద్దాడు కిండర్ కేర్‌కి వెళతాడు. ఏడాది కొక ఆర్నెల్లు మా పేరెంట్సూ మరో ఆర్నెల్లు మా అత్తారు వాళ్లూ వచ్చేరు కాబట్టి గత రెండేళ్లుగా నెట్టుకొస్తూ వున్నాం. తను ఉద్యోగం మానేస్తానని అంటే నేనే వద్ద న్నాను," అతను తన సొంత గోల చెప్పుకొస్తున్నాడు.

"బావుంది. మీ కష్టాల్ని నెట్టుకోవడం కోసం మీ పెద్దాళ్లని శిక్షిస్తున్నారన్న మాట," ఉత్పల మాటకి అతను ఆశ్చర్యపోయాడు.

"అందులో శిక్షేముందండీ? వాళ్లూ మనవలతో ఆనందంగా గడుపుతారు కదా! అయినా ఏం చేస్తాం చెప్పండి? డబ్బు సంపాదించి సుఖపడాలనే కదా మన మందరం అమెరికా వచ్చింది. ఒక్క జీతంతో కష్టమే. అయినా తను ఎం.టెక్. చేసి ఖాళీ ఉండటం దేనికని ఉద్యోగం చెయ్యమన్నాను. మా అమ్మాయి పుట్టినప్పు డయితే తనని ఉద్యోగం మానేయమనే చెప్పాను. తనే విన్లేదు. అప్పుడు వాళ్ల అమ్మానాన్నల్ని తెప్పించుకుంది. వాళ్ల ధర్మాన ఎలాగో నెట్టుకొచ్చాం."

"మీరు నిజాయితీగా చెప్పండి. మీ అమ్మాయి పుట్టాక మీరు ఉద్యోగం మానేయమన్నారా? లేక ఆవిడే మానేస్తానన్నారా? మీరు జవాబు చెప్పకపోయినా ఏమీ అనుకోను. మనిద్దరికీ ఉన్న స్వల్ప పరిచయంతో అడుగుతున్నాను."

అతను వెంటనే జవాబు చెప్పలేదు.

"మీరు నిజాయితీగా అన్నారు కాబట్టి చెబు తున్నాను. నేను మానేయమని అన్లేదు కాని తను మానేస్తాననడం నిజమే. ఇద్దరూ సంపాదిస్తే కాస్త హేపీగా ఉండచ్చు కదాని... నేనే వద్దన్నాను."

ఆ జవాబుతో అతని కంఠం మారింది. ఇంట్లో కాకపోయినా ముక్కూ మొహం తెలీని మనిషి దగ్గరైనా అతను పైకి అనగలిగాడని సంతోషించింది ఉత్పల. ఇంకేమీ మాట్లాడలేదు. డబ్బు సౌకర్యాలనిస్తుంది కానీ సుఖాన్నివ్వదు. ముఖ్యంగా మనసుకి. సమాజంలో ఆడవాళ్ల పాత్ర మారింది. ఇంతకుముందు తరాలకి పిల్లల్ని కనే యంత్రం. ప్రస్తుతం వ్యాపారయంత్రంగా ప్రమోట్ అయ్యింది. స్త్రీ యాంత్రిక జీవితానికి ఇంకా పురుషుడే యజమాని. ఎం.టెక్ చదివిన భార్య డిగ్రీ వేస్ట్ కాకూడదనే సాకు ఆమె ఉద్యోగానికి పునాది వేసింది. తన విషయంలో అయితే ఇది విరుద్ధం. ఎంతో కష్టపడి చదివిన చదువంతా వృధా అవుతోందని చెబితే ప్రభాకర్ ఎన్నడూ వినలేదు. ఉద్యోగం చేద్దామనుకునే తన ఇష్టానికి విలువ లేదు. స్వేచ్ఛలేదు.

ఫ్లయిట్ బయల్దేరడానికి సిగ్నల్ ఇచ్చినట్లున్నారు. అందరూ ఆ గేట్ వైపుగా వెళుతున్నారు. వాళ్లిద్దరూ కూడా అటుగా వెళ్లారు.

హాంకాంగ్ నుండి సింగపూర్‌కు వెళ్లిన నాలుగు గంటల ప్రయాణంలో అతను ఎక్కువగా మాట్లాడ లేదు. ఫ్లయిట్ ఎక్కగానే పడుకున్నాడు. ఉత్పల సినిమా చూస్తూ గడిపింది. సింగపూర్‌లో ఎనిమిది గంటలకు పైగా వెయిటింగ్. విమానాశ్రయం చాలా పెద్దది కావడం వల్ల అక్కడే ఉందామని నిశ్చయించుకుంది ఉత్పల. విమానం నుండి బయటికొస్తుండగా వర్మే అడిగాడు.

"మీరు ఎయిర్‌పోర్ట్‌లోనే ఉంటారా?" అవునని చెప్పింది. మళ్లా అతనే అన్నాడు.

"ఇక్కడ స్నానం చేసి రిఫ్రెష్ అవడానికి సదు పాయం ఉంది. ఎనిమిది డాలర్లంతే. ఎయిర్‌పోర్ట్‌లో ఇలా ఎనిమిది గంటలు గడపడం కష్టమే. సింగపూరు గవర్నమెంటు వాళ్ల రెండు గంటల సిటీ ఫ్రీ టూర్ ఉంటుంది. మీకు అభ్యంతరం లేకపోతే రండి. నేను వెళదామనుకుంటున్నాను."

ఒక్కతే ఇలా పలు ఆలోచనల్తో ఉండడం కంటే బయటికెళితే కాస్త ఆహ్లాదంగా ఉంటుందనుకుని సరే నంది. ఇద్దరూ రిఫ్రెష్ అయ్యాక ఉచిత సింగపూరు సిటీ సందర్శనానికెళ్లారు. సింగపూరు ట్రేడ్ సెంటర్ దగ్గరికి తీసుకెళ్లారు. అక్కడ బయట ఒకతను చిన్నపిల్లల గౌన్లు అమ్ముతున్నాడు. వర్మ రెండు గౌన్లు వాళ్ల పాపకి కొన్నాడు. అవి చూడగానే నేహ గుర్తుకొచ్చింది ఉత్పలకి. ఒక్కసారెందుకో ఏడుపొచ్చింది. ఎలా ఉందో చిన్నపిల్ల? ఈసారి అతను ఉత్పల కళ్లు తుడుచుకోవడం చూశాడు.

ఉత్పలని కొంటారా అనడిగాడు. వద్దంది. ఇంతలో అక్కడ బోట్ రైడ్ ఉంది అంటే వెళ్లారు. బోట్ రైడ్‌లో ఉండగా అతనే అడిగాడు.

"ఉత్పలగారూ, మీరేం అనుకోనంటే ఒకటడుగు తాను. మీరెందుకో ఏదో బాధలో ఉన్నారనిపిస్తోంది నాకు. అలా మీలో దాచుకోకండి. అదంత మంచిది కాదు. మీరు నాకు చెప్పాల్సిన అవసరం లేదు. జస్ట్ అడిగానంతే. సాధారణంగా ప్రయాణాల్లో కనిపించే కొత్త మనుషుల దగ్గర మన కష్టాలు కాస్త ఉపశమనం కోసం

చెప్పుకుంటాం. ఆ ఎదుటి వ్యక్తి తిరిగి కనిపించరన్న ధీమాతో కాబోలు స్వేచ్ఛగా చెప్పుకుంటాం. మీరు ఏదో బాధలో ఉన్నారనిపించి అడిగానంతే.''

తన ముఖ కవళికల్ని బట్టి గ్రహించాడన్నమాట. అంతవరకూ ముక్తసరిగా జవాబిచ్చిన ఉత్పలకి ఒక్క సారి దుఃఖం తన్నుకొచ్చింది. కాస్త గద్గద స్వరంతోనే అంది.

''మీరు ఇంతకుముందు ఇండియా ఎందుకు వెళ్తున్నారని అడిగారు. నేను జవాబివ్వకుండా దాట వేశాను. సొంత విషయాలు ఎవరికీ చెప్పే అలవాటు లేదు. మీరు మరీ ఇంతలా అడుగుతున్నారు కాబట్టి చెబుతున్నాను. నేను నా నాలుగేళ్ల పిల్లని మా వారికి వదిలిపెట్టేసి ఎవరికీ చెప్పకుండా ఇండియా వెళ్లిపోతు న్నాను.'' అంతకుమించి ఉత్పల మాట్లాడలేకపో యింది. ఈ మాటలు విని అతను ఆశ్చర్యపోయాడు.

''అయాంసారీ, మీకూ మీ ఆయనకు విభేదా లొచ్చాయా?'' నెమ్మదిగా అన్నాడు.

లేదన్నట్టు తలూపింది ఉత్పల. మరేమిటన్నట్టు చూసాడతను.

''మీ ఆయన మిమ్మల్ని హెరాస్ చేస్తాడా.''

''లేదండీ. ఆయన చాలా మంచివాడు. నన్నె ప్పుడూ పల్లెత్తు మాటనలేదు. నేనే ఉండలేక వెళ్లిపో తున్నాను.

''అదేమిటి? మీకు అమెరికా నచ్చలేదా?'' కాద న్నట్టు తలూపింది ఉత్పల.

''మరి?''

''మా ఇద్దరి మధ్యా గొడవలేం లేవు. కాకపోతే నా గమ్యం వేరంతే. ఎదుటపడి అతనికి చెప్పలేక... ఇలా...''

''చాలా చిత్రంగా ఉందండీ. ఒకపక్క పొరపొచ్చా ల్లేవంటున్నారు. మరోపక్క ఇమడలేక వచ్చేశానంటు న్నారు. మీరెందుకో నిజం చెప్పడం లేదనిపిస్తోంది.''

''నేను నిజమే చెబుతున్నాను నమ్మండి. మాదొక మధ్యతరగతి కుటుంబం. నన్ను ఎంతో కష్టపడి అమ్మా నాన్నా మెడిసిన్ చదివించారు. నేను బాగా చదువు తున్నానని వాళ్లకి స్థోమత లేకపోయినా అప్పు చేసి మరీ చదివించారు. చదువయ్యాక మాకు తెలుసున్న బంధువుల ద్వారా ప్రభాకర్ పెళ్లి సంబంధం వచ్చింది. ప్రభాకర్ అంటే మా ఆయన. చాలా ఆస్తిపరులు. నన్ను చూసి కట్నం లేకుండా, ఏరికోరి మరీ చేసుకున్నారు. ప్రభాకర్ అమెరికాలో ఉండడంతో ఆరేళ్ల క్రితం అమెరికా వచ్చేశాను. అంతకుముందు నేను హైదరా బాద్‌లో సిడిఆర్ హాస్పిటల్‌లో చేసేదాన్ని. అమెరికాలో మెడికల్ కోర్స్ చదువుదామని అనుకున్నాను. ఈ పెళ్లికి అంగీకరించడానికి అదీ ఒక కారణం. తీరా అమెరికా వచ్చాక నేననుకున్నదేమీ జరగలేదు. కేవలం కుటుంబా నికి పరిమితమయ్యింది నా జీవితం. చదవాలనుందని ఎన్నోసార్లు చెప్పాను. ప్రతిసారీ ఆయన మాట దాటేసే వారు. అమెరికా వచ్చాక ఏడాది పట్టింది సెటిల్ అవ డానికి. అప్పుడు మెడికల్ స్కూల్‌కి అప్లయ్ చేద్దామను కుంటుండగా మా అమ్మాయి నేహ కడుపున పడింది. ఆ తరువాత దాని ఆలనాపాలనా చూడడంలో నాలు గేళ్లు గడిచిపోయాయి. అమెరికాలో మెడికల్ చెయ్యా లంటే కొన్ని పరీక్షలు రాయాలి. అవన్నీ నేను ఇండియా లో ఉన్నప్పుడే రాశాను. ఇక్కడికొచ్చాక మరికొన్ని పరీక్షలు రాస్తే చాలు. ఉద్యోగం వస్తుంది. అది ఎక్కడ వస్తుందో తెలీదు. తన ఉద్యోగం సిలికాన్‌వేలీలో. ఆ సాకుతో వద్దన్నాడు. అడిగిన ప్రతిసారీ ఏదో ఒక కుంటి సాకు. ఒకసారి నన్ను, నేహని విడిచి ఉండలేనని ఏడ్చేశాడు. ఇలా ఏళ్లు గడిచిపోతున్నాయి. ఎంతో కష్టపడి చదివిన చదువంతా వృధా అయిపోతోందని బాధ కలిగింది. అందుకే...''

బోట్ శబ్దంలోనూ ఆమె మాటలు శ్రద్ధగా విన్నాడు. అతనికి బాధ కలిగింది.

''మీరు మళ్లా ఒకసారి అడిగి చూడకపోయారా?''

''ప్రయత్నం చేయలేదనుకుంటున్నారా? అన్నీ చేసాను. నేను ఉద్యోగం చేయడం ఇష్టంలేదని మాత్రం గ్రహించగలిగాను. ఆయన స్నేహితులు చెప్పినా పట్టించుకోలేదు. మా చెల్లీ, ఆమె భర్తా చెప్పినా అతనికి ఎక్కలేదు.''

''పోనీ ఎందుకు ఇష్టం లేదో చెప్పారా?''

''చెప్పలేదు. చెప్పడు కూడా. నేనే చివరికి నిర్ణ యించుకున్నాను. అందుకే ఇలా...''

''చాలా విచిత్రంగా ఉందండీ. ఈ రోజుల్లో ప్రతి మగాడూ ఉద్యోగం చేయగలిగిన పిల్లనే వెతుక్కుం టుంటే, మీకు అర్హతలున్నా వద్దనడం విచిత్రంగా ఉంది. ఒకపక్క మీరంటే అమిత ప్రేమంటున్నారు. మరోపక్క మీ ఇష్టానికి విలువ లేదని చెపుతున్నారు. నాకేమీ అర్థం కావడంలేదు. చాలా విచిత్రమైన వ్యక్తిలా ఉన్నారు, మీ ఆయన.''

''మొదట్లో ఆ మనిషి అస్సలర్థం కాలేదు. చెప్పా నుగా- నన్నెప్పుడూ పల్లెత్తు మాటనలేదు. ఎంతో

సౌమ్యుడు. ఆయనతో దెబ్బలాడ్డానిక్కూడా మనసు వచ్చేది కాదు. ఎంతో మథన పడిపోయాను. అలాగే ఏళ్లు గడిచిపోయాయి. ఇప్పటికే చాలా ఆలస్యమ యింది.'' ప్రతి మాటలోనూ ఆమె బాధ తెలుస్తోం దతనికి.

''మీ పెద్దవాళ్లెవరిచేతయినా చెప్పించలేక పోయారా?''

''ఆ మనిషంతే వినరు. వినే ప్రయత్నం కూడా చెయ్యడు.''

''మరి మీరైనా కారణం తెలుసుకోగలిగారా?''

''అనే అనుకుంటున్నాను. అందుకే అతన్నీ, అతనికీ నాకు ఉన్న ఒక్క అనుబంధాన్నీ కాదనుకుని వెళ్లిపోతున్నాను.''

''ఏమిటా కారణం? చెప్పండి?''

జవాబు చెప్పేలోపున టూర్ గైడ్ టైమయిందని పిలిచాడు. అందరూ బస్సులో కూర్చున్నారు. ఒకేచోట సీటు దొరక్క ఇద్దరూ వేర్వేరుగా కూర్చున్నారు. సింగపూర్ ఎయిర్‌పోర్టు వచ్చాక లోపలికెళుతుండగా మళ్లీ అతనే అడిగాడు.

''చెప్పండి ఆ కారణం ఏమిటయ్యుంటుందాని బస్సులో తెగ ఆలోచించాను. మీరు చూస్తే సున్నిత మనస్తత్వం కలవారుగానే అనిపిస్తున్నారు. మీ ఆయన మంచివాడంటున్నారు. నాకయితే ఊహక్కూడా అందడం లేదు.''

నవ్వింది ఉత్పల.

''చెప్పానుగా మా ఆయన వాళ్లు చాలా ఆస్తిపరు లని. మావారి వదినలందరూ ఇంట్లోనే ఉంటారు. నేనూ వాళ్లలాగే ఉండాలని ఆయన భావన. పైకి ఎప్పుడూ అనలేదు. కానీ, మా చెల్లెలితో ఇన్‌డైరెక్టుగా అన్నాడు. మా చెల్లెలు కూడా ఉద్యోగం చేస్తుంది. దాన్నిబట్టి గ్రహించాను. అదీకాకుండా... అమెరికాలో డాక్టర్లకి చాలా పెద్ద జీతాలొస్తాయి. మామూలు సాదా సీదా డాక్టర్లకే టూ హండ్రెడ్ థౌజండ్ డాలర్లు పైగా వస్తాయి. అదే సర్జన్లయితే హాఫ్ మిలియన్ వస్తాయి. ఆయన చేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి మహా అయితే నూట యాభైవేల డాలర్లు మించి రావు. భవిష్యత్తులో నా సంపాదన ఆయన దానికంటే ఎక్కువ ఉండడం అంటే తను నా మీద ఆధారపడ్డట్టుగా అనిపిస్తుంది. తనకంటే ఎక్కువ సంపాదిస్తూ ఉండడం అతను భరించలేడు. పైకెవరూ అనకపోయినా అందరికీ తెలు స్తుంది. ఎప్పటికీ ఆయనదే పైచేయుండాలి. పైకి చెప్పలేడు. చెబితే తను సౌమ్యుడన్న పేరు పోతుంది. బయటకు వెళ్లగక్కలేని పురుషాహంకారం. అంతకు మించి ఏమీలేదు.''

''ఈరోజుల్లో కూడా ఇలా ఆలోచించే వారుం టారా?''

''అన్నిరకాల మనుష్యులూ ఉంటారు. పది మందిలోనూ డాక్టర్‌గారి మొగుడని అతన్ని పిలుస్తారన్న ఆత్మన్యూనత. అందుకే వద్దన్నారు. ఎన్నిసార్లడిగినా సెంటిమెంటూ, ప్రేమ అనే మాటల్ని ఎరగా వాడుకుం టారు. మా అమ్మాయిని విడిచి ఉండలేరన్న సాకెలాగూ ఉంది. నేను ఎంతో కష్టపడి చదువుకున్నాను. నాకు చదువు విలువ తెలుసు. మేం చదివిన చదువు నిస్వార్థంగా ప్రజలకు ఉపయోగపడాలని మెడిసిన్ చదివే టప్పుడు మాచేత ప్రమాణం చేయిస్తారు. కాని నేనేం చేస్తున్నాను? ఎవరికీ పనికిరాకుండా పోతున్నాను. ఆయనకి నా అవసరం కంటే మనుష్యులకి నా అవ సరం ఎక్కువనిపించింది. డాక్టర్లందుబాటులో లేక ఎంతోమంది చనిపోతున్నారు. వాళ్లకి నా అవసరం ఉందనిపించింది. అందుకే...'' ఇహ మాటలు పెగల్లేదు ఉత్పలకి.

ఉత్పల ధైర్యమూ, ఆలోచనా చూసి అతను ఆశ్చర్యపోయాడు. పైకి అదే చెప్పాడు. ఆ తరువాత ఇద్దరూ పెద్దగా మాట్లాడుకోలేదు. సింగపూరు నుండి హైదరాబాద్ ఫ్లయిట్‌లో ఇద్దరికీ వేర్వేరు సీట్లొచ్చాయి. హైదరాబాద్‌లో దిగాక అతను ఉత్పల కోసం చూశాడు. ఇద్దరూ ఒకే లైన్‌లో నించుని ఉన్నారు.

''మీ కథ వింటుంటే ఒకపక్క బాధనిపించినా మరోపక్క మీ ధైర్యాన్ని మెచ్చుకోలేకుండా ఉండ లేకపోతున్నాను. ధైర్యం అనేకంటే మీరు చదువుకిస్తున్న విలువ చూస్తే సంతోషంగా ఉంది. మీమీద చాలా సింపతీగా ఉంది. మీ ఆయనెందుకో మంచివాడని నాకనిపించలేదు. ఎందుకంటే పైకి సౌమ్యంగా ఉన్నా ఆయన ఆలోచనలు మాత్రం అలాలేవు. మీ కథ సుఖాంతం కావాలని కోరుకుంటున్నాను. మీ ఈ-మెయిల్ ఇవ్వాలనిపిస్తే ఇవ్వండి. మళ్లీ కలుద్దాం,'' నవ్వుతూ అన్నాడు.

అతని మాటలు విని ఉత్పలకి కోపమొచ్చింది.

''మనిద్దరికీ ఉన్న స్వల్ప పరిచయంలో మీకు అంతే అర్థమైంది. మీ సింపతీ కోసం నేను ఇదంతా చెప్పలేదు. నాలో ఉన్న మథన పైకి చెప్పుకుంటే రిలీఫ్

గా ఉంటుందని చెప్పానంతే. మన పరిచయం ఇక్కడితో ఆగిపోతేనే బావుంటుంది. ప్రయాణాల్లో అపరిచితులతో మన గురించి చెప్పుకోవడమనేది మనకి మనం ఉపశమనం కలిగించుకోవడానికి తప్ప దాన్నించి ఇంకేదో ఆశించి కాదు. అందుకే మన పరిచయం పొడిగించడం నాకిష్టం లేదు. ఐ యాం సారీ.''

ఉత్పల మాటలు అతనూహించలేదు. ఒక్కసారి హతాశుడయ్యాడు. అది చూసి ఉత్పల అంది.

''నా ఇష్టం కాదన్నందుకు మా ఆయన మీద మీకటువంటి అభిప్రాయం రావడం సహజమే. అయినా, దాన్ని నేను ఒప్పుకోలేను. మరోసారి చెబుతున్నాను. ఆయన గురించి మీకు తెలీదు.''

ఇది విని అతని కళ్లల్లో పైకొచ్చిన అసహనపు భావం ఉత్పల గమనించింది. దానికి కాస్త సంస్కారం జోడించి వెటకారంగా అన్నాడు.

''అవును... అతను మంచివాడు... చాలా మంచివాడు. చెప్పండి, మంచివాడయితే ఇలా జరిగేదా?''

''అతను నిజంగా మంచివాడే... కానీ మగాడు. మీ అందరిలాంటివాడు...''

అంతవరకూ పైకి రాని ఉక్రోషం ఆమె మాటల్లో కనిపించింది.

ఇంతలో ఇమ్మిగ్రేషన్ ఆఫీసర్ ఉత్పలని పిలవడంతో బై చెప్పి వెళ్లిపోయింది. ఆమె వెళ్లిన వైపే చూస్తూ ఉండిపోయాడు వర్మ.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 4 అక్టోబర్ 2009*

